సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



అన్నదానానికి విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం నిత్యాన్నదానానికి పోతూరి సోమశేఖర్, సుహాసిని దంపతులు(మచిలీపట్నం) రూ.50వేలు విరాళం అందజేశారు.




మొక్కజొన్న.. లాభాల మిన్న

మెట్ట ప్రాంత రైతులు అనేక మంది తమ భూములను నిరుపయోగంగా వదిలేస్తున్నారు. అటువంటి వారు మొక్కజొన్న తోటలు వేసుకోవడం ద్వారా లాభాలు పొందుతున్నారు. - 8లో ▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,185, మధ్య డెల్టాకు 1,420, పశ్చిమ డెల్టాకు 3,800 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 6.55 అడుగులకు నీటి మట్టం చేరింది.



న్యూస్‌రీల్

మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 18 నుంచి 45 ఏళ్లలోపు మహిళలకు హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. దీంతో పాటు గల్ఫ్ దేశాలలో ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి ఎం.కొండలరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నకిలీ ఏజెంట్ల చేతిలో చిక్కి కొందరు మహిళలు గల్ఫ్ దేశాలకు వెళ్లి మోసపోయిన ఘటనలు జరిగిన నేపథ్యంలో దీని నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో తూర్పు, పశ్చిమగోదావరి, కడప జిల్లాల్లో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ అంశాలపై శిక్షణ ప్రారంభిస్తుందన్నారు. విదేశాలలో అనుసరించే మతపరమైన సంస్కృతులు, వారి పద్ధతులు, అలవాట్లతో పాటు ఆయా దేశాల చట్టాల గురించి అవగాహన కల్పిస్తూ శిక్షణ ఉంటుందని అన్నారు. అభ్యర్థులకు శిక్షణ అనంతరం గల్ఫ్ దేశాల్లో ఉపాధి చూపిస్తారన్నారు. ప్రభుత్వ అజమాయిషీలో జరిగే కార్యక్రమం కాబట్టి నకిలీ ఏజెంట్ల బారిన పడి మోస పోవడం ఉండదన్నారు. వెళ్లిన ఉద్యోగికి పనికి తగ్గట్టు ఆ దేశ చట్టాల ప్రకారం తగిన జీతభత్యాలు అందించడానికి సహకరిస్తారన్నారు. అక్కడ జీతభత్యాలు, పనిచేసే ప్రాంతంలో ఇబ్బందులు తలెత్తితే భారత రాయబార కార్యాలయం బాధ్యత తీసుకుని వారికి తగిన సహాయం అందిస్తుందన్నారు. ఈ శిక్షణకు 5వ తరగతి చదివి, చదవడం రాయడం తెలిసిన వారై ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు 95818 10049, 99489 95678 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కొండలరావు కోరారు.

ఉచిత సీట్లకు రేపటితో గడువు పూర్తి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పొందేందుకు దరఖాస్తుల తేదీ ఈ నెల 10తో ముగుస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం శనివారం తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం రాష్ట్రంలోని వెనుకబడిన వర్గాలు, అనాథలు, హెచ్ఐవీ బాధిత, వికలాంగులు, బలహీన వర్గాలు, షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల వర్గాలకు చెందిన పిల్లలకు 1వ తరగతిలో ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. అనాథ, హెచ్ఐవీ బాధిత, వికలాంగులకు 5 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, షెడ్యూల్ తెగలకు 4 శాతం, బలహీన వర్గాలు, బీసీ, మైనారిటీలు, ఓసీలు (పల్లెల్లో నివసించే వారి వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు మించని వారు), పట్టణ ప్రాంతాల్లో సంవత్సరానికి రూ.1.44 లక్షలు మించని వారికి 6 శాతం సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు ఈ నెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు.

మహిళా సాధికారతపై జాతీయ సదస్సు

బాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 10, 11 తేదీల్లో వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కృష్ణ శనివారం తెలిపారు. సదస్సుకు మహిళా సమాఖ్య, మహిళా వ్యవస్థాపకులు హాజరవుతారన్నారు. మహిళా సాధికారతపై మాట్లాడతారన్నారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన అనురాగ్ మిట్టల్, మహారాష్ట్ర విద్యాపీఠాధిపతి సునంద యాదవ్, తిలక్, జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుభాషిణీ తదితరులు హాజరవుతారన్నారు.

ధాన్యం కొనుగోలుకు రెడీ..!

- ప్రతి గింజా సేకరణకు ప్రణాళికలు
- సిద్ధం చేస్తున్న అధికార యంత్రాంగం
- ముందస్తుగా ప్రారంభమైన వరి కోతలు
- 5.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా



వరి కోతలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: రబీ ముందస్తు వరి కోతలు ప్రారంభమయ్యాయి. అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో ఊపందుకుంటున్నాయి. మరో పది రోజుల వ్యవధిలో మరికొన్ని ప్రాంతాల్లో వేగం పుంజుకునే అవకాశం ఉంది. రైతు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేసి దన్నుగా నిలవాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. దిగుబడి అందే నాటి కంటే ముందుగానే ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. సేకరణకు అవసరమైన ఏర్పాట్లలో తలమునకలైంది. కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు, యంత్రాలు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ తర్వాత ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

4.55 లక్షల మెట్రిక్ టన్నులే లక్ష్యం:

జిల్లా వ్యాప్తంగా రబీ సాధారణ సాగు 83,880 హెక్టార్లు. అత్యధికంగా వరి సాగవుతోంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 56,433 హెక్టార్లు కాగా.. 55,095 హెక్టార్లు సాగై 95 శాతానికి పైగా లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఏడాది 5.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో రైతులు, స్థానిక అవసరాలకు మినహాయించగా 4,55,845 మెట్రిక్ టన్నులు కొనుగోలుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. రైతులకు అనుకూలమైన మద్దతు ధర నిర్ణయించింది. సాధారణ రకం బస్తాకు (75 కిలోల బస్తా) రూ.1530, గ్రేడ్-ఏ రకానికి రూ.1545గా నిర్ణయించింది.

233 ఆర్బీకేల్లో..

జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో 315 ఆర్బీకేలుండగా 233 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. వాటిని 147 మిల్లులకు అనుసంధానం చేశారు. ఆయా కేంద్రాలకు నియమించిన సాంకేతిక సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. సేకరణకు జిల్లా వ్యాప్తంగా 70 లక్షల గన్నీ బ్యాగుల అవసరం ఉందని, ఏ మండలానికి ఎన్ని కావాలో ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తున్నారు. ఆర్బీకేల వద్ద సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈ-క్రాప్, తేమ శాతం నిబంధనల ప్రకారం ధాన్యం సేకరిస్తారు. అనంతరం మొబైల్ యాప్‌లో రైతులకు కూపన్లు ఇస్తారు. కొనుగోళ్లకు మండల వ్యవసాయ అధికారులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. గ్రామ వలంటీర్లను సైతం భాగస్వాముల్ని చేస్తున్నారు. ధాన్యం రవాణా చేసే వాహనాలపై నిఘా పెడుతున్నారు. రవాణా చార్జీలు ఎవరికి చెల్లించాలనే విషయమై జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఎకరానికి 53 బస్తాల దిగుబడి:

రబీ ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉంటున్నాయి. ఎకరానికి 52 నుంచి 53 బస్తాల దిగుబడి అందుతోంది. జిల్లాలో అత్యధికంగా ఎంటీయూ-1121 రకం ధాన్యం సేకరించనున్నారు. 3.39 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. 76,000 మెట్రిక్ టన్నులు బోండాలు, 30 వేల మెట్రిక్ టన్నుల సన్న రకాలు ఉత్పత్తి అయ్యే సూచనలున్నట్లు వెల్లడించారు. ఈ పరిణామం రైతుల్లో ఆనందాన్ని నింపుతోంది. పెట్టుబడులకు పోను లాభాలు గడించవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటివరకూ వరి కోతల వివరాలు (హెక్టార్లలో..)

మండలం	సాగు	కోతలు
రాజమండ్రి రూరల్	1135	652
కడియం	2324	1
రాజానగరం	3285	1149
అనపర్తి	3755	12
బిక్కవోలు	5718	25
కోరుకొండ	2229	120
గోకవరం	1706	40
సీతానగరం	2719	100
రంగంపేట	812	120
చాగల్లు	3264	5
దేవరపల్లి	2786	41
కొవ్వూరు	4210	29
తాళ్లపూడి	3147	12
నల్లజెర్ల	2182	15

మూడేళ్లుగా దిగుబడులు టాప్..



జిల్లాలో 2021 ఖరీఫ్‌లో 82,695 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. ఎకరానికి (75 కిలోల బస్తా) 28 బస్తాల ధాన్యం దిగుబడి వస్తే.. 2022 ఖరీఫ్‌లో 73,606 హెక్టార్లలో వరి సాగయ్యింది. ఎకరానికి 33 బస్తాల దిగుబడి వచ్చింది. ఏడాది వ్యవధిలో ఎకరం పొలానికి 5 బస్తాలు వృద్ధి చెందింది. 2021 ఖరీఫ్‌లో మొత్తం 4,29,990 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అందితే.. 2022లో 4,52,368 మెట్రిక్ టన్నులు.. అంటే 22,378 మెట్రిక్ టన్నులు అదనంగా దిగుబడి వచ్చింది. గత ఐదేళ్లుగా ఇలాంటి దిగుబడులు ఎప్పుడూ నమోదు కాలేదని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇప్పటికే 2321 హెక్టార్లలో కోతలు పూర్తయినట్లు సమాచారం.

ప్రతి గింజా కొంటాం



రబీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం చేశాం. ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేసి సేకరణపై అధికారులు, సిబ్బందికి సలహాలు సూచనలు చేశాం. ముందస్తు కోతలు వచ్చే ప్రాంతాల్లో కేంద్రాలు ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం. 4.55 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. 233 ఆర్బీకేలు సిద్ధం చేస్తున్నాం. వారం రోజుల తర్వాత కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

– ఎస్.తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్

జిల్లా ఎస్పీగా సుధీర్‌కుమార్ రెడ్డి

త్వరలో బాధ్యతలు స్వీకరిస్తానని వెల్లడి



సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లా ఎస్పీగా సీహెచ్ సుధీర్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. కోనసీమ ఎస్పీగా కొనసాగుతున్న ఈయన తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా వ్యవహరిస్తున్నారు. పూర్తి స్థాయి ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. సుధీర్‌కుమార్ రెడ్డి 2010 బ్యాచ్ కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారి. గతేడాది జూన్‌లో కోనసీమ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి సమర్థవంతమైన పోలీస్ అధికారిగా పేరు గడించారు.

కొత్త జిల్లా ఎస్పీగా త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నట్లు 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా వ్యవహరిస్తున్న కారణంగా జిల్లాపై అవగాహన ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు స్పష్టం చేశారు.

వివిధ ప్రాంతాల్లో ..

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నుంచి పోలీసు శాఖకు వచ్చిన సుధీర్‌రెడ్డి 2012 ఆగస్టు నుంచి 2013 డిసెంబర్ వరకు కర్నాటకలోని భత్కల్ ఎస్పీగా పనిచేశారు. తర్వాత రెండేళ్ల పాటు కర్నాటక రాష్ట్రం బీదర్ ఎస్పీగా వ్యవహరించారు. 2016-17 పదహారు నెలల పాటు మండ్యా ఎస్పీగా, 2017-18 ఎనిమిది నెలలు మంగళూరు ఎస్పీగా, 2018-2019 బెల్గాం ఎస్పీగా 15 నెలల పాటు వ్యవహరించారు. 2019-2020 కర్నాటక పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా వ్యవహరించారు. 2020-21లో విజయవాడ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఎస్పీగా 10 నెలలు పని చేశారు. 2021-2022 కర్నూలు ఎస్పీగా ఏడాది పాటు బాధ్యతలు నిర్వర్తించారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణంలో బాబు దోపిడీ

ఎంపీ భరత్ విమర్శ

రాజమహేంద్రవరం రూరల్: టిడ్కో గృహాలతో సెల్ఫీ ఫొటో తీసుకుని సెల్ఫ్‌డబ్బా కొట్టుకోవడం కాదని, నిజంగా మీ హయాంలో రాష్ట్రంలో 11 లక్షల గృహాలు కట్టించినట్టు నిరూపిస్తే తాను రాష్ట్రం విడిచి వెళ్లిపోతానని మాజీ సీఎం చంద్రబాబుకు ఎంపీ భరత్ సవాల్ విసిరారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడ్కో ఇళ్ళ నిర్మాణంలో చంద్రబాబు, లోకేష్ కమీషన్ల పేరుతో బొక్కేశారని విమర్శించారు. టిడ్కో ఇల్లు చదరపు అడుగు నిర్మాణానికి రూ.1000 నుండి రూ.1200 మాత్రమే ఖర్చవుతుందన్నారు. కానీ చంద్రబాబు, లోకేష్ గుత్తేదారులతో బేరసారాలు కుదుర్చుకుని రూ.3వేలకు పెంచేసి స్వాహా చేశారని ఆరోపించారు. టిడ్కో గృహానికి కేంద్ర ప్రభుత్వం రూ.1.5లక్షలు మంజూరు చేస్తే ప్రభుత్వ పరంగా చంద్రబాబు ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 300 చదరపు అడుగుల టిడ్కో గృహాలకైతే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి ఒక్క రూపాయికి ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. , 365 చ.అ. టిడ్కో ఇంటి లబ్ధిదారులకు రూ.50 వేలకు గాను రూ.25 వేలు, 425 చదరపు అడుగులకు రూ.50 వేలు చెల్లిస్తే చాలన్నారు. మిగిలిన సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం భరించేలా సీఎం నిర్ణయం తీసుకున్నారన్నారు. గౌడ, శెట్టిబలిజ, శ్రీశయన యాత, ఈడిగ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పాలిక శ్రీను, ఖాదీ బోర్డు వైస్ ఛైర్మన్ పిల్లి నిర్మల, రాజమండ్రి సిటీ యువజన అధ్యక్షులు పితా రామకృష్ణ, ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ వైస్ ఛైర్మన్ గేడి అన్నపూర్ణ రాజు, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ మార్గాని సురేష్, పెంకే సురేష్, డాక్టర్ అనుసూరి పద్మలత తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

30 నుంచి చినవెంకన్న బ్రహ్మోత్సవాలు

వచ్చేనెల 4న రాత్రి శ్రీవారి తిరుకల్యాణం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శోభకృత్ నామ సంవత్సర వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్నాయి. పాంచాహ్నిక దీక్షతో ఈ ఉత్సవాలను వచ్చేనెల 7 వరకు వైభవోపేతంగా జరుపనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు శనివారం వెల్లడించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో శ్రీవారికి ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామోత్సవాలను నిర్వహిస్తామన్నారు. అలాగే ఆయా రోజుల్లో స్వామివారికి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తామన్నారు. బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

ఉత్సవ విశేషాలివీ..

- 30వ తేదీ ఉదయం శ్రీవారిని పెండ్లికుమారునిగా, అమ్మవార్లను పెండ్లికుమార్తెలుగా చేయడంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు.
- ఏప్రిల్ 1న రాత్రి 7 గంటలకు అంకురార్పణ అనంతరం ధ్వజారోహణను నిర్వహిస్తారు.
- 2న ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటల నుండి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 3న ఉదయం 7 గంటల నుంచి హనుమద్వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7 గంటల నుండి బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం జరుగుతుంది. రాత్రి వెండి శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరగుతుంది.
- 4న రాత్రి 8.30 గంటల నుంచి శ్రీ స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం. అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం.
- 5న రాత్రి 7.30 గంటల నుంచి క్షేత్ర పురవీధుల్లో రథోత్సవం జరుగుతుంది.
- 6న ఉదయం 10.30 గంటల నుండి చక్రవారి-అవభృథోత్సవం, మధ్యాహ్నం 3 గంటల నుంచి వేద సభ, రాత్రి 7 గంటల నుంచి పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ, రాత్రి 8 గంటలకు అశ్వవాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది.
- 7న ఉదయం 9 గంటల నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సం జరుగుతుంది. రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగము-పవళింపుసేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం



ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారు

భవిష్యత్తు తరాలకు భరోసా సీఎం జగన్

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్



మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న చందన నాగేశ్వర్. చిత్రంలో ఎంపీ బోస్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భవిష్యత్తు తరాలకు భరోసాగా నిలబడనున్నారని రాజ్యసభసభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరు,కొంతమూరు గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్మన్ చందన నాగేశ్వర్ నేతృత్వంలో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని సచివాలయకన్వీనర్లు, గృహసారథులు కలిసి ప్రస్తుత పాలనపై, గత టీడీపీపాలనపై అభిప్రాయం తెలుసుకునే దిశగా అడుగులు ముందుకు వేయడం శుభపరిణామమన్నారు. భావి తరాలకు భరోసాగా జగనన్న ఉన్నారనే ధైర్యాన్ని కల్పించే దిశగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో బడుగు,బలహీనవర్గాలు అట్టడుగుస్థాయిలో ఉండేవారన్నారు. వైఎస్సార్‌సీపీపాలనలో వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేద,మధ్యతరగతి వర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశపెట్టి స్వయం ఉపాధి కల్పించి బాసటగా నిలుస్తున్నారన్నారు. సాహోసపేతమైన నిర్ణయాలు తీసుకుని వినూత్నమైన పాలనతో సంక్షేమరాష్ట్రంగా నిలబట్టేందుకు పాటు పడుతున్న జగన్‌కు ప్రజలు మరలా పట్టం కడతారన్నారు. చందననాగేశ్వర్,గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి 15నిమిషాలపాటు వారితో మాట్లాడి పథకాలు, వలంటీర్లు పనితీరు తదితర విషయాలపై అభిప్రాయాలను సేకరించారు. లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేసి స్వయంగా స్టిక్కర్‌లను ఇంటికి,సెల్‌ఫోన్‌కు అంటించుకున్నారు. జేసీఎస్ కన్వీనర్ విష్ణు మూర్తి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు సత్తిబాబు చౌదరి, కాతేరులో పార్టీనాయకులు యెజ్జు వాసు, పెనుమాక సునీల్, కొత్తపల్లి నాగేశ్వరరావు, గూడూరి సురేష్, చీకట్ల కిరణ్, మదిని రాజేష్, అరిగెల హరీష్,రంజిత్, దుర్గారావు, కన్వీనర్లు,గృహసారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్యాపిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

కడియం: తన భార్య, ముగ్గురు పిల్లలు కనిపించడం లేదంటూ కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన ఐ.శ్రీనుబాబు పోలీసులను ఆశ్రయించాడు. గత ఏడాది నవంబర్ 30న తన భార్య ధనసాయిలక్ష్మి, తొమ్మిదేళ్ల కుమార్తె విజయకనకదుర్గ, ఏడేళ్ల హర్షవర్ధన్, ఐదేళ్ల వేదశ్రీ అదృశ్యమయ్యారని శ్రీనుబాబు ఫిర్యాదు చేశాడు. తాను పనికి వెళ్లిన తరువాత స్కూలు నుంచి పిల్లలను తీసుకుని వెళ్లినట్టు తెలిసిందన్నారు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ భార్యాపిల్లల ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

తుని: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపాన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై మురళీమోహన్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారానికి ఎడమవైపు ఉన్న కాలువ వద్ద రెండు గోడల మధ్య ఇనుప గొట్టానికి అతడు ఉరి వేసుకున్నాడు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతడిని అస్సాం రాష్ట్రం గోలపర గ్రామానికి చెందిన బర్మాన్ సంజయ్‌గా గుర్తించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు 24 వరకూ దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరిలో ఉన్న ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపించాలని ప్రధానోపాధ్యాయిని ఎస్.వెంకటలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 20న జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు 2021-23 విద్యా సంవత్సరాల్లో 3, 4 తరగతులు చదివి ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థినులు దీనికి అర్హులన్నారు. 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీలు; 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98665 59624 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

పాడి-పంట

మొక్కజొన్న.. లాభాలు మిన్న



- హైబ్రిడ్ విత్తనాలు మేలంటున్న శాస్త్రవేత్తలు
- పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రత్యేక దృష్టి
- ఎకరాకు 35 క్వింటాళ్ల వరకూ దిగుబడి

సామర్లకోట: మెట్ట ప్రాంత రైతులు అనేక మంది తమ భూములను నిరుపయోగంగా వదిలేస్తున్నారు. అటువంటి వారు మొక్కజొన్న తోటలు వేసుకోవడం ద్వారా లాభాలు పొందే అవకాశాలున్నాయని పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కజొన్న మనిషికి ఆహారంగానే కాకుండా పశువులకు దాణాగా కూడా ఉపయోగపడుతుంది. మొక్కజొన్నతో అనేక రకాల పిండి వంటలు కూడా తయారు చేస్తారు. ఇటీవల మొక్కజొన్న సాగుపై రైతుల్లో అవగాహన పెరగడంతో వారిని ప్రోత్సహించడానికి వ్యవసాయ అధికారులు కూడా ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా సంకరజాతి విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నామని పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పి.మునిరత్న, ఐ.సుధీర్‌కుమార్ చెబుతున్నారు.

సాగుకు అనుకూలంగా హైబ్రీడ్ వంగడాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతోంది. అధిక ఉత్పాదకత కలిగిన అనుకూల వాతావరణం ఉండటంతో ఇక్కడ సాగుకు దీర్ఘ, మధ్యకాలిక విభాగాల్లో అధిక దిగుబడినిచ్చే హైబ్రీడ్ వంగడాలు అనుకూలంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కజొన్న నుంచి వివిధ ఉప ఉత్పత్తులు తయారు చేసి, ఎగుమతి చేయడం ద్వారా లాభాలు ఆర్జించే అవకాశం కూడా ఉంది. ఈ పంటపై ఆధారపడి దాదాపు 500 రకాల పరిశ్రమలు ఉన్నాయని చెబుతున్నారు. మొక్కజొన్నలోని ప్రతి పదార్థమూ వివిధ రకాల ఉత్పత్తుల తయారీకి మూలపదార్థంగా ఉపయోగపడతాయి. పశువుల మేతగా, పూత దశలో కూరగాయగా, పాలు పోసుకునే దశలో కాల్చి తినే కండెగా, గింజ ముదిరిన తరువాత అనేక రకాల పరిశ్రమల్లో ముడిసరకుగా మొక్కజొన్న ఉపయోగపడుతుంది. మొక్కజొన్న నూనెను అనేక దేశాల్లో వంటలకు వాడతారు. హృదయ సంబంధిత రోగులకు ఇది మంచిదని అంటారు. ఈ నూనెలో లినోలిక్, ఒలియిక్ ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటుంది. మొక్కజొన్న పిండితో కార్న్‌ఫ్లాక్స్, సూప్‌మిక్స్, ఇన్‌స్టెంట్ కార్న్, పఫ్స్, ఉప్మా మిక్స్, కేసరి బాదం, పేలాల వంటి కారపు, తీపి పిండి వంటలు చేసుకోవచ్చు. ప్రత్యేక రకాలైన తీపి మొక్కజొన్న, బేబీ కార్న్ వంటి రకాలు కూడా ఉన్నాయి.

పొలం ఎంపిక ఇలా..

మురుగు నీరు నిలవని, కలుపు, తెగుళ్లు లేని సారవంతమైన నేలలు మొక్కజొన్న సాగుకు అనుకూలం. గత సీజన్‌లో మొక్కజొన్న పండించి ఉండకూడదు. ఒకవేళ మొక్కజొన్న వేసి ఉంటే జన్యు స్వచ్ఛత కోసం నీటి తడి ఇచ్చి, నేలలో గత సీజన్ విత్తనాలను మొలకెత్తనిచ్చి బెరుకులు లేకుండా దున్ని, నశింపజేయాలి. నీటి వసతి ఉండాలి. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకూ రబీ విత్తు కూడా వేసుకోవచ్చు. ఎకరానికి 10 కిలోల ఆడ, మగ విత్తనాల మోతాదు వాటి వరుసల నిష్పత్తిపై ఆధారపడి ఉంటుంది. దాదాపు సాధారణ మొక్కజొన్న పంటలో మాదిరిగానే నీటి యాజమాన్యం సరిపోతుంది. పంట అన్ని దశల్లోనూ నీటి ఎద్దడి లేకుండా చూడాలి. మొదటి తడిలో ఆడ, మగ సాళ్లలోని విత్తనాలు కలిసిపోకుండా చూడాలి. గింజ తయారయ్యే దశలో ఎకరాకు 20 కిలోల నత్రజని అదనంగా వేయాలి.

మొక్కజొన్నపై పరిశోధనలు

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మొక్కజొన్న పంటపై వివిధ పరిశోధనలు సాగిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలోని రైతులకు మేలైన సాంకేతికతతో పాటు సాగులో సమస్యలకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. రబీలో ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్లు, ఖరీఫ్‌లో 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.
– డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత, వ్యవసాయ పరిశోధన స్థానం, పెద్దాపురం



పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

సీఎం సభకు స్థలం పరిశీలన



బహిరంగ సభకు గోష్పాద క్షేత్రంలో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, అధికారులు

కొవ్వూరు: 'వలంటీర్లకు వందనం' పేరుతో గ్రామ/వార్డు వలంటీర్లకు పురస్కారాలు అందించే రాష్ట్రస్థాయి కార్యక్రమం కొవ్వూరులో ఈ నెల 14వ తేదీన జరగనుంది. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభకు అనువైన స్థలాలను శనివారం ఆమె పరిశీలించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామ/వార్డు వలంటీర్ల సేవలకు గుర్తింపుగా నగదు పురస్కారాలను సీఎం చేతుల మీదుగా అందించనున్నారని కలెక్టర్ తెలిపారు. సభ నిర్వహణ, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను పరిశీలించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ ఏర్పాట్లకు సంబంధించి ఇప్పటికే హోం మంత్రి తానేటి వనితతో కలిసి ఐదారు స్థలాలను సందర్శించారు. పట్టణంలోని సత్యవతి నగర్‌లో ఉన్న స్థలాలను, సంస్కృత పాఠశాల ప్రాంగణం, గోష్పాద క్షేత్రం వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభ నిర్వహించే స్థలం ఇంకా కొలిక్కి రాలేదని కలెక్టర్ చెప్పారు. అన్నింటికీ అనువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్డీఓ ఎస్.మల్లిబాబు, ఆర్అండ్‌బీ ఈఈ ఐ.దేవేంద్రరాజు, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరిపై వివాహాల రిజిస్ట్రేషన్ల నిలుపుదల

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివాహాల రిజిస్ట్రేషన్లను నిలుపు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గతంలో వివాహాలు చేసుకున్నవారి అభ్యర్థన మేరకు అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసేవారు. అయితే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతూండటంతో ఆ రిజిస్ట్రేషన్లను నిలుపు చేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్ వ్రత సమయం మార్పు

సత్యదేవుని సన్నిధికి వచ్చి, స్వామివారి వ్రతం చేయించుకునే వెసులుబాటు లేనివారు ఆన్‌లైన్‌లో రూ.1,116 చెల్లిస్తే వారి గోత్రనామాలతో వ్రతం ఆచరించే వీలు కల్పించిన విషయం విదితమే. ఇప్పటి వరకూ ఉదయం 9 గంటలకు ఈ వ్రతం నిర్వహించి, దానిని దేవస్థానం యూట్యూబ్ చానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసేవారు. దీని వలన ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే స్వామివారి కల్యాణం ప్రత్యక్ష ప్రసారం చేసే అవకాశం ఉండేది కాదు. దీంతో ఆన్‌లైన్ వ్రతాన్ని గంట ముందుకు మార్చారు. ఆదివారం నుంచి ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకూ నిర్వహించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ వ్రతం అనంతరం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకూ సత్యదేవుని నిత్యకల్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: పట్టణంలోని పుంతలో ముసలమ్మ గుడిలో కూచి వెంకట మోహన్ నాగసాయి దుర్గా వీరభద్ర కల్కి, (18) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నతనం నుంచీ అతడు మేనమామ నేతి నారాయణశర్మ సంరక్షణలో పెరుగుతున్నాడు. ఈ నెల 6న నారాయణశర్మ పౌరోహిత్యం పని మీద చింతలపూడి మండలం ప్రగడవరం వెళ్లారు. ఆయన భార్య శ్రీలక్ష్మి సత్యవతి చెన్నై వెళ్లారు. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న కల్కి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని పట్టణంలో ఉంటున్న అతడి పెద్దమ్మ, నారాయణశర్మ సోదరి శనివారం గుర్తించి ఆయనకు సమాచారం అందించారు. తన మరో సోదరి కుమారుడైన కల్కి చిన్నతనం నుంచీ తన వద్దే ఉంటున్నాడని, అన్నవరం వేద పాఠశాలలో వేదవిద్య నేర్పించానని నారాయణశర్మ చెప్పారు. కల్కి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు



సంఘటన స్థలంలో చెట్టును ఢీకొట్టిన కారు

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి, చెట్టును ఢీకొంది. పోలీసులు, హైవే మెయింటెనెన్స్ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. కాకినాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న బెన్ని, కౌశిక్, ప్రవీణ్, భరత్, సూర్య కలిసి శనివారం కారులో విశాఖ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్నేహితుడిని సూరంపాలెంలో దించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వారి కారు గండేపల్లి శివారులో లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయి, అక్కడున్న చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులూ తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి హైవే మెయింటెనెన్స్, రోడ్డు సెఫ్టీ సిబ్బంది చేరుకుని, కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. 108, హైవే అంబులెన్సులో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ నగర్‌లో చోరీ

- రూ.5 లక్షల సొత్తు అపహరణ
- వరుస చోరీలతో అమలాపురం వాసుల ఆందోళన

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఓ ఇంట్లో శనివారం తెల్లవారుజామున జరిగిన చోరీలో రూ.5 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైంది. విద్యుత్ శాఖలో పార్ట్‌టైమ్ ఉద్యోగిగా పని చేస్తున్న కుడుపూడి బాలకృష్ణ ఇంట్లో దొంగలు 18 కాసుల బంగారు నగలు దోచుకున్నారు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న బాలకృష్ణ శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి, స్వగ్రామం అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మికి భార్యాపిల్లలతో వెళ్లారు. ఆయన ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని పై అంతస్తులో ఉంటున్న యజమాని సత్తి రామచంద్రమూర్తి శనివారం ఉదయం గమనించారు. ఆయన ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారంతో బాలకృష్ణ వెంటనే పాలగుమ్మి నుంచి విద్యుత్ నగర్ చేరుకున్నారు. ఇంట్లో చోరీ జరిగిందని, బీరువాలోని 18 కాసుల బంగారు నగలను దొంగలు దోచుకున్నారని గుర్తించారు. దొంగలు వీధి తలుపుల తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్‌రూమ్‌తో పాటు ఇతర గదుల్లో ఉన్న బీరువాలను తెరచి సామాన్లను చిందరవందర చేశారు. క్లూస్ టీమ్ వచ్చి దొంగల వేలిముద్రలను సేకరించింది.



చోరీ జరిగిన ఇంట్లో స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్న పోలీసులు

సంఘటన స్థలాన్ని పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి సందర్శించారు. చోరీ జరిగిన ఇంటికి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి సీసీ పుటేజీలను పరిశీలించారు. ఆ కెమెరాలు రోడ్డు వైపు ఉండటంతో కేసు దర్యాప్తులో భాగంగా పుటేజీలు సేకరించారు. పట్టణ ఎస్సై కేవీవీ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ ఎం.సుబ్బరాజు, సిబ్బంది బాలకృష్ణ కుటుంబీకుల స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఇద్దరు ముసుగు దొంగలు గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి చొరబడి యజమానిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ మర్నాడే విద్యుత్ నగర్‌లో చోరీ జరగడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.